మౌలిక వసతులు కరువు

- వరి కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు నిల్
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు


బావాయిపల్లిలో రైతులు ఆరబెట్టిన వరిధాన్యం

కోడేరు: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామాల్లోనే ధాన్యం విక్రయాలు జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు. కాని కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో ప్రభుత్వం శ్రద్ధ కనబర్చలేదు. దీంతో రైతులు ధాన్యం రాశులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసింది. రైతుల వరిధాన్యం తడవడంతో ఆందోళన చెందుతున్నారు. పంటల దిగుబడి అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. పండించిన పంటలు అమ్ముకోవడానికి ఆగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అసౌకర్యాలు వెంటాడుతుండటంతో రైతుల కష్టాలు అంతాఇంతా కాదు.

టార్పాలిన్ కవర్లు లేక..

కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ధాన్యం ఆరబెట్టేందుకు టార్పాలిన్ కవర్లు అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజుల తరబడి కిరాయి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి అందుబాటులో కవర్లు ఉంచాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు అవస్థలు

రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వెళ్తే అసౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ప్లాట్‌ఫామ్‌లు లేవు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో అడపాదడపా వర్షాల కారణంగా పొలాల నుంచి నేరుగా కేంద్రానికి తరలిస్తున్నారు. కేంద్రాల్లో సిమెంట్ ప్లాట్‌ఫామ్స్ లేక ధాన్యాన్ని మట్టిపై పోయాల్సిన దుస్థితి నెలకొంది. రైతులు కిరాయికి కవర్లు తీసుకొచ్చి ధాన్యం అందులో పోస్తూ ఆరబెడుతున్నారు. ధాన్యం ఆరక తేమశాతం రాకపోవడంతో రోజుల తరబడి కేంద్రాల్లో ఉండాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి

వరి కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి. వరిధాన్యం ఆరబెట్టేందుకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలి. కేంద్రాల వద్ద తాగునీటి వసతి కల్పించాలి. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– యాపచెట్టు లాలు, కోడేరు



చర్యలు తీసుకుంటాం

మండలంలో వరి కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం. రైతులు ఇబ్బందులు పడకుండ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుతాం.

– పార్వతమ్మ, ఏపీఎం, కోడేరు

క్లుప్తంగా

నేటి నుంచి కలశ ప్రతిష్ఠాపనోత్సవాలు

కొల్లాపూర్: పట్టణంలోని శివాలయంలో శుక్రవారం నుంచి కలశ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తునట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతారని పేర్కొన్నారు. ఈ నెల 11న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి హాజరవుతారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏకలవ్య ప్రవేశాలకు నేడు చివరి గడువు



వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 9వ తేదీ చివరి గడువు ఉందని ప్రిన్సిపాల్ పర్దీప్‌కుమార్ గురువారం తెలిపారు. ఏకలవ్య ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి ఫేజ్ కింద విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు పేర్కొన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు సకాలంలో వచ్చి పాఠశాలల్లో చేరాలని ఆయన కోరారు.

విద్యార్థులకు సన్మానం



కొల్లాపూర్: 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్యవైశ్య విద్యార్థులను ఆవోపా నాయకులు సన్మానించారు. గురువారం పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 993 మార్కులు సాధించిన శ్రీవైష్ణవిని నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను సన్మానించారు. ఆవోపా కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అర్థం రవికుమార్, నాయకులు చందనం శ్రీనివాసులు, ఆకుతోట సుదర్శన్, శేషయ్య, శ్రీదేవి, కుసుమ, నిర్మల తదితరులున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి



తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కోరారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ముఖ్య నాయకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఖైరత్, సుబ్బయ్య, యాదమ్మ, బాలమణి, జ్యోతి పాల్గొన్నారు.

వాసవీ మాత జయంతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అష్టోత్తర పారాయణం చేశారు. సుప్రియ, మణెమ్మ, శ్రీదేవి, ఉమ, సౌమ్య, శివానీ, భార్గవి, మంజుల, వాసవి, సాయిలీల, సునంద, పాల్గొన్నారు.

లట్టుపల్లిలో విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లిలో నాగ జ్యోతిశ్వర దేవాలయంలో శుక్రవారం లక్ష్మీ గణపతి, నాగ ప్రతిష్ఠ, పంచముఖ ఆంజనేయ స్వామి, నవ గ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆకుల సిద్ధయ్య తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ పూజలు మొదలవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారని, గురువారం గణపతి పూజ, దేవార్చనలు, ప్రత్యేక హోమాలు, పుష్పాదివాసము వంటి పూజలు కొనసాగాయి.



రైతుల సమస్యలను పరిష్కరించాలి


వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అచ్చంపేట రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కరువైందని సీపీఎం మండల కార్యదర్శి వర్థం సైదులు, సీనియర్ నాయకుడు రాములు అన్నారు. గురువారం మండలంలోని హాజీపూర్, చందాపూర్ వరిధాన్యం కేంద్రాలను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాగు తూకం తప్ప అదనంగా కాంటాలు చేయొద్దని డిమాండ్ చేశారు. హమాలీ ఖర్చులు అంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ధాన్యం తీసుకొచ్చిన రైతులకు కనీస సౌకర్యాలు కూడా లేవని తాగడానికి మంచినీరు కూడా లేదని అన్నారు. హాజీపూర్ మిల్లును వదిలేసి ఉప్పునుంతల మండలంలోని ఉప్పరిపల్లిలో ఉన్న మిల్లుకి వడ్లు సరఫరా చేయడం వల్ల రవాణా సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు శివకుమార్, రైతులు గణేష్, తిరుపతి నాయక్, రవి, సురేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



తెలకపల్లి: యువతి అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్నారం గ్రామానికి చెందిన కూరల అఖిల(19) ఈనెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన చిర్ల శివకృష్ణపై అనుమానం ఉందని యువతి తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నర్సరీలల్లో మొక్కలను కాపాడుకుందాం



వెల్దండ: మండలంలోని కొట్రలో నర్సరీని గురువారం ఏపీఓ ఈశ్వర్‌జీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలల్లో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలన్నారు. మొక్కలు ఎండిపోతే తిరిగి మళ్లీ ఖాళీ బెడ్లలో విత్తనాలను నాటించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది ఉన్నారు.


రైతులందరికీ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

వెల్దండ: రైతులందరికీ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈఓ గణేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్ రైతువేదిక వద్ద రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకునేందుకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతి రైతుకు గుర్తింపు కార్డులను జారి చేసే ప్రక్రియలో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రీ 14 నంబర్లతో విశిష్ట సంఖ్య(యూనిక్) కేటాయిస్తుందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు యొక్క ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడీ కేటాయించ బడుతుందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నలుగురికి జైలుశిక్ష, జరిమానా

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలుశిక్షతో పాటుగా, జరిమానాను జడ్జి విధించనట్లుగా ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించగా, అందులో నలుగురు మద్యం తాగి, మరో 14 వాహనాలు సరైన వాహనాలు, పత్రాలు లేని వారిని కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ముందు ప్రవేశపెట్టారు. కేసులను పరిశీలించిన జడ్జి కావ్య వారిలో మండలంలోని తర్నికల్ తండాకు చెందిన రమేష్, వంగూర్ మండలం అన్నారంకు చెందిన హరీష్, పట్టణానికి చెందిన అనిల్, మండలంలోని ఎల్లికల్ చెందిన రమేష్‌లకు మూడురోజుల జైలుశిక్షతో పాటుగా, ఒక్కొక్కరికి రూ.100 జరిమానాను విధించారు. మిగిలిన 14 మంది వాహనదారులకు జరిమాను విధించారని ఎస్ఐ తెలిపారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు



చారకొండ: లారీ బోల్తాపడి లారీ డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని తిమ్మాయిపల్లి సమీపాన ప్రధాన రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపుకు వరి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ వెళ్తోంది. ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ పాండు నాయక్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం అందించడంతో ఘటన స్థలంలో ప్రథమ చికిత్స నిర్వహించారు. లారీ బోల్తా పడడంతో ధాన్యం బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. వాహనాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ శంషోద్దీన్ సిబ్బందితో ఘటన స్థలం పరిశీలించారు. ధాన్యం బస్తాలను వేరే లారీలో లోడ్ చేసి పంపించారు. వాహనాలకు అంతరాయం కలగకుండా చేశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శంషోద్దీన్ తెలిపారు.

ఇల్లు ఇప్పించాలని వినతి

వీపనగండ్ల: ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ గురువారం మండల కేంద్రానికి చెందిన అందూరుకొండ చంద్రశేఖర్‌శెట్టి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరలక్ష్మికి ఒక వినతిపత్రం అందజేశారు. సొంత ఇల్లు లేకపోవడంతో కిరాయి ఇంట్లో ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నానని, అంధత్వం కారణంగా ఎలాంటి పని చేసుకోలేకపోతున్నానని వాపోయారు. అధికారులు, నాయకులు తనకు స్థలం, ఇల్లును ఇప్పించాలని కోరారు.

బరువు పేరుతో తరుగు సరికాదు



బిజినేపల్లి: వరి ధాన్యం కేంద్రాంల్లో బరువు పేరుతో తరుగు తీయడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.అశోక్ అన్నారు. గురువారం మండలంలోని నందివడ్డెమాన్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఐకేపీల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గన్నీ సంచుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు చంద్రశేఖర్, హనుమంతు, రాములు, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీతపై శిక్షణ



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో విద్యార్థులకు భగవద్గీత పారాయణంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన కొంతమంది విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. ఉపాధ్యాయుడు రవిచంద్ర విద్యార్థులకు భగవద్గీతలో శిక్షణ ఇస్తున్నాడు. వేసవి సెలవులలో తమ పిల్లలకు భగవద్గీత పారాయణం నేర్చుకునేందుకు తల్లిదండ్రులు పంపించాలని కోరారు. దేవస్థానం చైర్మన్ కల్వ మనోహర్ ఆలయ ప్రాంగణంలో విద్యార్థులకు వసతి సమకూర్చారు.

షీ టీమ్స్‌పై అవగాహన

చారకొండ: మండలంలోని జూపల్లి జెడ్పీహెచ్ఎస్ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా షీ టీమ్స్‌పై విద్యార్థులకు గురువారం హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ వెంకటస్వామి మాట్లాడుతూ బాలికల భద్రతే లక్ష్యమన్నారు. ఎవరైనా బాలికలను వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఝాన్సీరాణి, మహిళ కానిస్టేబుల్ పద్మావతి, వేసవి శిక్షణ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



పైపులైన్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే


మేలకుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో రైతు మల్లయ్యగౌడ్ తీసిన పైపులైన్ పనులను గురువారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పరిశీలించారు. మేలకుంట నుంచి రైతు వ్యవసాయ పొలానికి పైపులైన్ పనులు చేస్తున్నాడు. గ్రామ రైతులు పనులు అడ్డుకునేందుకు యత్నించారు. ఈ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని పైపులైన్ పనులను పరిశీలించారు. రైతులను సమదాయించి ఎవరికి ఇబ్బందులు లేకుండా పైప్‌లైన్ పనులు చేపట్టాలని కోరారు. అంతకు ముందు మరికల్‌లో కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జర్నలిస్టుల నిరసన


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

అచ్చంపేట రూరల్: ఏపీలో పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని పలువురు జర్నలిస్టులు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ అచ్చంపేట ప్రెస్ క్లబ్, వివిధ జర్నలిస్టు యూనియన్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఏపీ ప్రభుత్వం, అక్కడి పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సోదాలు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. జర్నలిస్టులు బండారు శ్రీనివాస్, రేసోజు సాయిబాబు, సీనియర్ జర్నలిస్టులు దూమర్ల భాస్కర్, కాలూరి శ్రీనివాసులు, సేవకుల శేఖర్, పదిర బాల్‌రాజు, షఫి, వెంకటేష్, వెంకటయ్య, ప్రభాకర్, నారాయణరావు, సుధాకర్, మురళి, రాములు, రాఘవేందర్, తాహేర్, రమేష్, కుమార్, శివ, రాజశేఖర్, సహజానందం, భరత్, నరేందర్, ఈశ్వర్, సైదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'రాజీవ్ యువ వికాసం' ఇంటర్వ్యూలు


ఉప్పునుంతలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నాగర్‌కర్నూల్ రూరల్: రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు పూర్తి అయినట్లు ఎంపీడీఓ కోటేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తాడూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని సిర్సవాడ, పాపగల్ గ్రామాలకు చెందిన అభ్యర్థులకు తెలంగాణ వికాస బ్యాంకు అవంచ పరిధిలో మొత్తం 71 మంది దరఖాస్తు చేసుకోగా 36 మంది మాత్రం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ నర్సింహులు, ఏపీఎం బాల్‌చందర్, బ్యాంకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్‌కు పరిధిలో మొత్తం 352 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 211 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం రాజీవ్ యువ వికాసానికి మొత్తం 643 మంది దరఖాస్తులు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఎంపీడీఓ నాగేందర్, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ హాజరయ్యారు.

చారకొండలో..

చారకొండ: రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల కేంద్రంలో రైతు వేదికలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. యూనియన్ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు నర్సింహ, శివప్రసాద్, ఏపీఎం రాములు పాల్గొన్నారు.

13 నుంచి 15 వరకు..

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు ఈ నెల 13వ తేదీ నుంచి 15 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ గురువారం పేర్కొన్నారు. మొత్తం 2,370 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈనెల 13న చెర్కూర్, పెద్దాపూర్, కుప్పగండ్ల, కేస్లీతండా, మర్రిగుంతతండా, శంకరకొండతండా, చౌదర్‌పల్లి, నారాయణపూర్‌తండా, పల్గుతండా, భర్కత్‌పల్లి, చెదురుపల్లి, బొల్లంపల్లి, బండోనిపల్లి, ఉబ్బలగట్టుతండా గ్రామాలకు ఎస్‌బీఐ బ్యాంక్ వెల్దండ, పెద్దాపూర్ కెనరా బ్యాంక్ అధికారులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల14న పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, సిలోనిబావితండా, బైరాపూర్, పోచమ్మగడ్డతండా, ఎంజీ కాలనీతండా, నగారగడ్డతండా, అల్లంతోటబావి తండా, వెల్దండ, కంటోనిపల్లి, గుండాలకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జూపల్లి, ఎస్‌బీఐ వెల్దండ, కెనరా బ్యాంక్ పెద్దాపూర్, ఈ నెల15న అజిలాపూర్, కుందారంతండా, కొట్ర, రాచూర్, తిమ్మినోనిపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఇర్విన్, ఎస్‌బీఐ వెల్దండ, ఎస్‌బీఐ కల్వకుర్తి బ్యాంక్‌ల అధికారులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఊర్కొండలో..

ఊర్కొండ: మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో మాదారం, గుడిగానిపల్లి, రేవల్లి, తిమ్మన్నపల్లి రాచలాపల్లి గ్రామాల నుంచి 175 మంది రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మౌఖిక పరీక్షలు నిర్వహించామని ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, యూకో బ్యాంక్ మేనేజర్ హరిచంద్ర ప్రసాద్, ఏపీఎం సంతోష్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, బీసీ కార్పొరేషన్ బాధ్యులు వెంకటేష్, రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రామచంద్రయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు సజావుగా ఇంటర్వ్యూలు

లింగాల: మండల పరిషత్ కార్యాలయంలో ఏపీజీవీబీ తుమ్మన్‌పేట పరిధిలోని గ్రామాలకు, అదే విధంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ పెద్ద కార్పముల బ్యాంక్‌ల పరిధిలోని వారికి ఆయా బ్యాంక్ మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, మేనేజర్లు సోముకుమారు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

అప్పు తీర్చడానికి అనాథ బాలుడి వెట్టిచాకిరి


గంగారంలో విచారణ చేస్తున్న పిల్లల సంరక్షణ జిల్లా అధికారి శ్రీశైలం

బిజినేపల్లి: చిన్నమ్మ, చిన్నాన్న చేసిన అప్పులు తీర్చడానికి మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన మైనర్ బాలుడిని చదువు మాన్పించి, నాగర్‌కర్నూల్ మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఓ ఇంట్లో పనికి ఒప్పందం కుదిరింది. సంవత్సర కాలంగా పనిచేస్తున్నా ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వట్టెం గ్రామానికి చెందిన బోడ మల్లయ్య, అతని భార్య మరణించారు. దీంతో అనాథగా మారిన మైనర్ బాలుడిని వరుసకు మేనత్త అయిన గంగారం గ్రామానికి చెందిన గాలమ్మ వద్ద ఉండి 5వ తరగతి వరకు చదువుకున్నాడు. నల్లవెల్లిలో నివాసం ఉంటున్న బాలుడి చిన్నాన్న, చిన్నమ్మలు మైనర్ బాబుని తామే చదివించుకుంటామని చెప్పి గాలమ్మ వద్ద నుంచి తీసుకెళ్లారు. తర్వాత వారు ఓ వ్యక్తి ఇంట్లో పని చేయడానికి బాలుడిని పంపించారు. బాలుడు ఆ పనులు చేయలేక మేనత్త గాలమ్మ ఇంటికి చేరుకున్నాడు. సామాజిక మాధ్యమాల్లో వార్త వైరల్ కావడంతో జిల్లా పిల్లల సంరక్షణ అధికారి శ్రీశైలం గంగారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాలుడి స్థితి గతులపై విచారణ చేశారు. బాలుడికి అవసరమైన విద్యతో పాటు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అంతేకాక లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: గ్రామాల్లో గర్భిణుల వివరాలను నమోదు చేస్తూ పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేర్లు నమోదు చేయించుకున్న గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, పీహెచ్‌సీలో కాన్పులతో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై చైతన్యం చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ నివారణ, మిషన్ ఇంద్రధనస్సు, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీహెచ్ఓ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు తారాశశాంక్, మైథిలి, నాగరాజు, నిహారిక, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.